సాక్షి
విశాఖపట్నం

గురువారం । 7 । డిసెంబర్ । 2023

న్యూస్‌రీల్

ముమ్మరంగా తుపాను సహాయక చర్యలు



వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టర్ మల్లికార్జున, కమిషనర్ సాయికాంత్ వర్మ

మహారాణిపేట : జిల్లాలో తుపాను సహాయక చర్యలు ముమ్మరంగా చేపట్టినట్లు కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున తెలిపారు. బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు, జాయింట్ కలెక్టర్లతో తుపాను ప్రభావిత ప్రాంతాల్లో చేపట్టిన సహాయక చర్యలపై సమీక్షించారు. విశాఖ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మల్లికార్జున జిల్లాలో చేపట్టిన తుపాను సహాయక చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్‌వర్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జాతీయ క్రీడల్లో మహిళా ఏఎస్‌ఐ ప్రతిభ



సీసీఎస్ ఏఎస్‌ఐ అనురాధను అభినందిస్తున్న పోలీస్ కమిషనర్ రవిశంకర్

అల్లిపురం: హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాలలో జరిగిన ఎస్‌బీకేఎఫ్ 9వ నేషనల్ గేమ్స్–2023లో పాల్గొని పతకాలు సాధించిన సీసీఎస్ పోలీస్ స్టేషన్ మహిళా ఏఎస్‌ఐ బి.అనురాధను సీపీ ఎ.రవిశంకర్ బుధవారం తన కార్యాలయంలో అభినందించారు. పవర్ లిఫ్టింగ్ 50+ కేటగిరీ, డిస్కస్ త్రోలో బంగారు పతకాలు, జావెలిన్ త్రోలో వెండి, షాట్‌పుట్‌లో కాంస్య పతకాలను ఆమె సాధించారు. వచ్చే ఏడాది గోవాలో జరగనున్న అంతర్జాతీయ స్థాయి మాస్టర్స్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ పోటీలకు అనురాధ అర్హత సాధించారు. ఈ మేరకు సీపీ ఆమెను అభినందించారు. సక్రమంగా విధులు నిర్వర్తిస్తూ.. క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరచడం ప్రశంసనీయమన్నారు. భవిష్యత్‌లో అనురాధ మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఆమెకు ట్రావెల్, డైట్ ఫండ్‌లను స్పెషల్ ఫండ్ రూపంలో అందజేయాలని అధికారులను ఆదేశించారు.

బాక్సింగ్‌లో హోంగార్డుకు గోల్డ్‌మెడల్



బీచ్‌రోడ్డు: హిమాచల్ ప్రదేశ్‌లో గత నెల 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జరిగిన 9వ నేషనల్ గేమ్స్‌లో కిక్ బాక్సింగ్ పోటీల్లో మూడో పట్టణ ట్రాఫిక్ హోంగార్డు రమేష్ గోల్డ్‌మెడల్ సాధించారు. హెవీ వెయిట్ కేటగిరిలో రమేష్ గోల్డ్‌మెడల్ సాధించారు. ఆయన్ని మూడో పట్టణ సీఐలు కోరాడ రామారావు, అమ్మి నాయుడు అభినందించారు.

గౌహతి–బెంగళూరు మధ్య ఒన్‌వే స్పెషల్

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా గౌహతి–బెంగళూరు మధ్య వన్‌వే స్పెషల్ రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. గౌహతి–బెంగళూరు(05670) వన్ వే స్పెషల్ గౌహతిలో ఈ నెల 9వ తేదీన ఉదయం 6 గంటలకు బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 3.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఇక్కడ నుంచి 3.50 గంటలకు బయల్దేరి మరుసటిరోజు 11వ తేదీ ఉదయం 9.10 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు 1–థర్డ్ ఏసీ, 7 స్లీపర్ క్లాస్, 8–జనరల్ సెకండ్ క్లాస్, 2–సెకండ్ క్లాస్ కోచ్‌లతో నడుస్తుంది.

- ఈ నెల 7వ తేదీన హౌరాలో బయల్దేరాల్సిన హౌరా–తిరుచ్చిరాపల్లి(12663) ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు.

ఆన్‌లైన్‌లో నృసింహ హోమం టికెట్లు

సింహాచలం: స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహగిరిపై ఈనెల 10వ తేదీన జరిగే నృసింహ హోమం టికెట్లు ఆన్‌లైన్‌లో కూడా అందుబాటులో ఉంటాయని దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. ఆరోజు ఉదయం 7 గంటల నుంచి నృసింహ హోమం ప్రారంభమవుతుందన్నారు. భక్తులు www.aptemples.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా టికెట్లు పొందవచ్చని పేర్కొన్నారు.



సాక్షి, విశాఖపట్నం: భారత నౌకాదళంలో కీలక ప్రాంతంగా విశాఖపట్నం అభివృద్ధి చెందుతోంది. సముద్ర జలాల పరిరక్షణ, ప్రపంచ వాణిజ్య కార్యకలాపాలు సాగించే కీలకమైన భద్రతకు అవసరమైన షిప్‌లు, జలాంతర్గాములు, సర్వే వెసల్స్.. విశాఖ కేంద్రంగా ఉన్న తూర్పు నౌకాదళంలో కేంద్రీకృతం కానున్నాయి. సిటీ ఆఫ్ డెస్టినీ కాస్తా సిటీ ఆఫ్ డిఫెన్స్‌గా రూపాంతరం చెందేలా ఏకంగా రూ.2వేల కోట్లకు పైగా నిధులతో తూర్పు నౌకాదళాభివృద్ధి పనులు మొదలయ్యాయి. కీలకమైన యుద్ధ నౌకలతో పాటు ఇండియన్ నేవీలో రెండో యుద్ధ విమాన వాహక నౌక ఐఎన్‌ఎస్ విక్రాంత్ కూడా విశాఖ నుంచే కార్యకలాపాలు నిర్వహించనుంది. నౌకాదళానికి కేంద్ర బిందువుగా మారనున్న నేపథ్యంలో ప్రతిష్టాత్మక మిలాన్ విన్యాసాలను ముంబయిలో కాకుండా.. వరసగా రెండోసారి విశాఖలోనే నిర్వహించాలని రక్షణ మంత్రిత్వ శాఖ నిర్ణయించడం విశేషం.

1968లో చిన్న అవుట్ పోస్టుగా ప్రారంభమైనప్పటి నుంచి.. నౌకాదళంలో కీలకంగా ఎదిగింది విశాఖ కేంద్రంగా ఉన్న తూర్పు నావికాదళం. తూర్పు తీరం వెంబడి 2,562 కి.మీల విస్తీర్ణంలో స్థావరాలను ఏర్పాటు చేస్తూ.. తీర పరిరక్షణలో ముఖ్య భూమిక పోషిస్తోంది.

దేశంలోని అన్ని సాయుధ దళాల కమాండ్‌లలో భౌగోళిక పరంగా 'ది లార్జెస్ట్ కమాండ్'గా విస్తరించి ఉంది. ఈఎన్‌సీలో ప్రస్తుతం 37 వేలకు పైగా సిబ్బంది ఉండగా.. ఇందులో 2,895 మంది అధికారులు, 21,085 మంది నావికులు, 3,695 డీఎస్‌సీ సిబ్బంది, 9,689 మంది రక్షణ పౌరులున్నారు. భారత ప్రభుత్వం లుక్ ఈస్ట్ పాలసీ ప్రవేశపెట్టిన తర్వాత.. సముద్ర వాణిజ్యానికి తూర్పు తీరం ప్రధాన కేంద్రంగా మారడంతో వాణిజ్య నౌకల రక్షణ బాధ్యత కూడా తూర్పు నౌకాదళమే నిర్వర్తిస్తోంది. దీంతో పాటు డీఆర్‌డీవో కార్యకలాపాలకు కూడా తూర్పు తీరమే వేదికగా మారింది. పలు క్షిపణులు తయారు చేసే నేవల్ సైన్స్ అండ్ టెక్నాలజికల్ లేబొరేటరీస్(ఎన్‌ఎస్టీఎల్) కూడా విశాఖలోనే ఉంది. ఇలా.. ఈఎన్‌సీ బలీయమైన శక్తిగా మారింది.

ఆయుధ సంపత్తి పెరుగుతోంది



ప్రపంచ రక్షణ దళాల్లో కీలకంగా వ్యవహరించేలా.. తూర్పు నౌకాదళం ఆయుధ సంపత్తి విషయంలోనూ బలోపేతం కానుంది. ఐఎన్‌ఎస్ ఢిల్లీ, ఐఎన్‌ఎస్ ముంబయి ఐఎన్‌ఎస్ మైసూర్ యుద్ధ నౌకలు త్వరలోనే విశాఖ నుంచే కార్యకలాపాలు ప్రారంభించనున్నాయి. 2037 నాటికి పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారవుతున్న 20 నుంచి 25 యుద్ధ నౌకలు తూర్పు నౌకాదళ అమ్ములపొదిలో చేరనున్నాయి. ఇందులో నీలగిరి క్లాస్ ఫ్రిగేట్‌లు, నెక్స్ట్ జనరేషన్ కార్వెట్ క్లాస్ షిప్‌లు, డైవింగ్ సపోర్ట్ వెసల్స్, సర్వే వెసల్స్, యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్‌లు, వాటర్ క్రాఫ్ట్‌లు, న్యూక్లియర్ సబ్‌మెరైన్‌లు రాబోతున్నాయి. అదే విధంగా మల్టీ–రోల్ 60ఆర్ 60ఆర్, అప్‌గ్రేడ్ చేసిన యాంటీ సబ్‌మెరైన్ కమోవ్ 28 హెలికాప్టర్లు, మీడియం లిఫ్ట్ ఈ–295 ఎయిర్‌క్రాఫ్ట్‌లు కూడా విశాఖలో కేంద్రీకృతం కానున్నాయి. సర్వే వెసల్స్‌లో మొదటిది సంధాయక్ వచ్చే ఏడాది ప్రారంభంలో తూర్పు నౌకాదళ అమ్ములపొదిలో చేరనుంది. భారత నౌకాదళానికి డైవింగ్ సపోర్టు షిప్‌లను విశాఖలోని హిందూస్థాన్ షిప్‌యార్డులోనే నిర్మిస్తుండటం విశేషం. మరోవైపు ఇండియన్ నేవీలో రెండో యుద్ధ విమాన వాహక నౌక ఐఎన్‌ఎస్ విక్రాంత్ సైతం విశాఖ కేంద్రంగా సేవలందించనుంది. వచ్చే ఏడాది మొదటి త్రైమాసికంలోనే విశాఖ రానుంది. వీటన్నింటితో రాబోయే రోజుల్లో విశాఖ కేంద్రంగా ఉన్న తూర్పు నౌకాదళం.. దేశ రక్షణ వ్యవస్థకు పెద్దన్నలా మారనుంది.

విశాఖలో మరోసారి మిలాన్



తూర్పు నౌకాదళం మరింత బలోపేతం అవుతోంది. ప్రపంచ దేశాల స్నేహపూర్వకంగా వాణిజ్య వ్యవహారాలు సాగించేలా ఈఎన్‌సీ వ్యవహరిస్తోంది. విశాఖ ప్రజలు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రక్షణ వ్యవస్థకు సంపూర్ణ సహకారం అందుతోంది. తూర్పు సముద్ర తీరంలో ఏ సవాలు ఎదురైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం. ఎప్పటికప్పుడు ఆయుధ సంపత్తి పెంచుకుంటూ ముందుకు వెళ్తున్నాం. మన యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, ఎయిర్‌క్రాఫ్ట్‌లు హిందూ మహాసముద్ర ప్రాంతంలోని తూర్పు చోక్ పాయింట్, మలక్కా జలసంధి, సుండా జలసంధి, లాంబాక్ జలసంధి, ఓంబే–వెటార్ జలసంధితో సహా వ్యూహాత్మక ప్రాంతాల్లో ఉనికిని ప్రదర్శించేందుకు నిరంతరం మోహరించి ఉంటాయి. అందుకే.. తూర్పు నౌకాదళం క్రమంగా ఎదుగుతూ వస్తోంది. ఈ కారణంగానే మరోసారి విశాఖ వేదికగా మిలాన్–2024 నిర్వహించాలని నిర్ణయించాం. ఏ సహకారం కావాలన్నా తాము అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ భరోసాతో 50 దేశాలతో రికార్డు స్థాయిలో మిలాన్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్, ఈఎన్‌సీ చీఫ్

రక్షణ రంగంలో రారాజుగా...



ఆయుధ సంపత్తిని పెంచుకుంటూ రక్షణ రంగంలో రారాజుగా మారుతోంది ఈస్ట్రన్ నేవల్ కమాండ్. ఇప్పటికే నేవల్ సైన్స్ అండ్ టెక్నాలజీ లేబొరేటరీ(ఎన్‌ఎస్టీఎల్), నేవల్ ఆర్మ్‌డ్ డిపో(ఎన్‌ఏడీ)తో పాటు ఎయిర్ స్టేషన్ ఐఎన్‌ఎస్ డేగా.. ఇలా ప్రతి అంశంలోనూ విశాఖ నగరం కేంద్రంగా మారింది. మరింత బలోపేతం అయ్యేందుకు సాంకేతికతను అందిపుచ్చుకునేలా ఈఎన్‌సీ కేంద్రాన్ని అప్‌గ్రేడేషన్ చేస్తున్నారు. సాంకేతిక మౌలిక సదుపాయాలను పెంపొందించడంలో గణనీయమైన పురోగతిని సాధించే దిశగా రూ.2,192 కోట్లతో 37 ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. భద్రతా నిబంధనలకు అనుగుణంగా విశాఖ విమానాశ్రయం రన్‌వే పునరుద్ధరణ ప్రక్రియ కూడా చేపట్టారు. దీనికి అనుబంధంగా నేవల్ ఎయిర్ బేస్ ఐఎన్‌ఎస్ డేగాలో ఎయిర్ ఫీల్డ్ లైటింగ్ సిస్టమ్ అప్‌గ్రేడేషన్ జరుగుతోంది. ఇది పూర్తయితే భారత నౌకాదళం విశాఖపట్నం నగరానికి ప్రపంచ స్థాయి ఎయిర్‌ఫీల్డ్‌ను అందించనుంది. ఇది విమానయాన భద్రతలో అత్యున్నత ప్రమాణాలకు అనుగుణంగా ఉండబోతోంది.

వ్యర్థాలను తొలగించండి

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో కమిషనర్ పర్యటన



కాన్వెంట్ జంక్షన్ వద్ద చెత్త తొలగింపు పనులు పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: తుపాను ప్రభావిత ప్రాంతాల్లో బుధవారం జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పర్యటించారు. జోన్–4 పరిధి సీహార్స్ జంక్షన్ నుంచి పోర్టు ఏరియా మీదుగా రోస్‌హిల్స్ చర్చి దిగువ భాగం వరకు ఉన్న ఎస్‌ఎల్ కెనాల్, కాన్వెంట్ జంక్షన్ ప్రధాన కాలువ వద్ద వర్షం కారణంగా ఏర్పడిన వ్యర్థాలు, విరిగి పడిన చెట్ల కొమ్మల తొలగింపు పనులను పరిశీలించారు. పోర్టు ప్రాంతంలో జరుగుతున్న కాలువ, రోడ్డు పనులు పరిశీలించారు. కోటవీధి నివాసిత ప్రాంతంలో డంపర్‌బిన్ ఏర్పాటు చేయాలని ఏఎంవోహెచ్ రాజేష్‌ను ఆదేశించారు. పోర్టు నుంచి దుమ్ము, ధూళితో పాటు మురుగునీరు నిల్వలతో దోమలు వృద్ధి చెంది వ్యాధులకు గురవుతున్నామని ఆ ప్రాంత నివాసితులు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఆయన స్పందిస్తూ.. ఆయా ప్రాంతాలను పరిశుభ్రపరచాలని, గంభూషియా చేపలు విడుదల చేయాలని జోనల్ కమిషనర్ శివప్రసాద్‌ను ఆదేశించారు. దోమల నియంత్రణకు ఫాగింగ్, మంచినీటి సరఫరా చేస్తున్నారా లేదా అని కమిషనర్ ఆరా తీశారు. అనంతరం జ్ఞానాపురం, కంచరపాలెం, ఎన్‌ఏడీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. వ్యర్థాలు వెంటనే తొలగించాలని, రవాణా సౌకర్యానికి ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట జోనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, ఏసీపీ వినయ్‌ప్రసాద్, కార్యనిర్వాహక ఇంజినీర్ సంతోషి, శానిటరీ సూపర్‌వైజర్ కిశోర్ తదితరులు ఉన్నారు.

సీవోసీ నుంచి పర్యవేక్షణ

మిచాంగ్ తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను జీవీఎంసీలోని సిటీ ఆపరేషన్ సెంటర్(సీవోసీ) ద్వారా కమిషనర్ సాయికాంత్ వర్మ పర్యవేక్షించారు. రైల్వేస్టేషన్, కొబ్బరితోట, డాల్ఫిన్ జంక్షన్, ఫిషింగ్ హార్బర్, కాన్వెంట్ జంక్షన్, హనుమంతువాక, గోపాలపట్నం, తాటిచెట్లపాలెం, సత్యం జంక్షన్ తదితర ప్రదేశాలను సీసీ కెమెరాల ద్వారా పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ తుపాను నేపథ్యంలో నగర ప్రజలు, ముఖ్యంగా లోతట్టు, కొండవాలు ప్రాంత ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సంబంధిత అధికారులకు వెంటనే తెలియజేయాలని సూచించారు. నిరంతరం సీసీ కెమెరాల ద్వారా ఆయా ప్రాంతాలను పరిశీలించి.. అక్కడ గుర్తించిన సమస్యలను అధికారిక వాట్సాప్ గ్రూప్‌లో పోస్ట్ చేయాలన్నారు. గెడ్డల పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనించాలని ఆదేశించారు.

నెల్లూరు తరలి వెళ్లిన ఈపీడీసీఎల్ అధికారులు

- త్వరితగతిన విద్యుత్ సరఫరా పునరుద్ధరించేందుకు చర్యలు
- ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ వెల్లడి



విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులను పరిశీలిస్తున్న ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్

సాక్షి, విశాఖపట్నం : తుపాను ప్రభావంతో భారీ వర్షాల వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిన ప్రాంతాల్లో త్వరితగతిన పునరుద్ధరణ పనులు పూర్తి చేస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. ఇంధన శాఖ కార్యదర్శి కె.వి జయానంద్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో తీవ్ర నష్టం వాటిల్లిన నెల్లూరు జిల్లాలో ఏపీఎస్పీడీసీఎల్‌కు సహకరించేందుకు సీఎండీ పృథ్వీతేజ్ ఆధ్వర్యంలో ఈపీడీసీఎల్ అధికారులు, సిబ్బంది మంగళవారం తరలివెళ్లారు. గూడూరు తదితర ప్రాంతాల్లో సిబ్బందితో సమీక్షలు నిర్వహించి, తిప్పగుంటపాలెం, చెందోడు, కోట, వెనుగుంటపాలెం, మామిడికాలువ తదితర ప్రాంతాల్లో బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టాన్ని పరిశీలించారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు సీఎండీ అవసరమైన సూచనలిస్తున్నారు. అదేవిధంగా ఈపీడీసీఎల్ పరిధిలోని రాజమండ్రి, ఏలూరు, విజయనగరం సర్కిళ్ల అధికారులతో ఎప్పటికప్పుడు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహిస్తూ విద్యుత్తు సరఫరాను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించేందుకు అవసరమైన ఆదేశాలిస్తున్నారు. వర్షాల కారణంగా ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని 5 సర్కిళ్లలో ప్రధానంగా నష్టం ఏర్పడిన రాజమండ్రి, ఏలూరు, విజయనగరం సర్కిళ్లలో 5 పట్టణాల్లో, 82 మండలాలకు 77 మండలాల్లో, 2,001 గ్రామాలకు గాను 1,110 గ్రామాల్లో విద్యుత్ పునరుద్ధరణ పనుల్ని చురుగ్గా నిర్వహించారు. అదే విధంగా 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు 154 దెబ్బతినగా 150 పునరుద్ధరించామని, 33 కేవీ ఫీడర్స్ 139కి 134, 11 కేవీ ఫీడర్స్ 761కి 752, 33 కేవీ పోల్స్ 24కి 16, 11కేవీ పోల్స్ 717కి 514, ఎల్టీ పోల్స్ 652కి 385 పోల్స్, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్స్ 397కి 173, వ్యవసాయ కనెక్షన్లు 36,648కి 35,724 సర్వీసులకు విద్యుత్తు సరఫరా పునరుద్ధరించామన్నారు. మిగిలిన వాటిని త్వరితగతిన పూర్తి చేసేందుకు 395 ప్రత్యేక బృందాలతో సంస్థ సిబ్బంది రేయింబవళ్లు కష్టపడి పని చేస్తున్నారని సీఎండీ పృథ్వీతేజ్ వెల్లడించారు. ఏలూరు సర్కిల్ నుంచి 60 మంది నెల్లూరు సర్కిల్ విద్యుత్ పునరుద్ధరణ చర్యల్లో అవసరమైన సామగ్రితో సహకరిస్తున్నారని తెలిపారు. వర్షాల ప్రభావంతో తెగిపడిన విద్యుత్ వైర్లు, పడిపోయిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను తాకవద్దని ప్రజలకు సీఎండీ సూచించారు.

ముసురుకున్న వాన

- తెరలు తెరలుగా కురిసిన వర్షం
- అగనంపూడిలో 4 సెం.మీల నమోదు
- నేడు కూడా తేలికపాటి చిరుజల్లులు



సాక్షి, విశాఖపట్నం: మిచాంగ్ తుపాను తీరాన్ని దాటాక కూడా విశాఖలో వర్షం కొనసాగింది. బుధవారం వేకువజాము నుంచి రాత్రి వరకు తేలికపాటి నుంచి మోస్తరు వాన కురుస్తూనే ఉంది. నగరం కంటే శివారు ప్రాంతాల్లోనే వర్షం ఒకింత ఎక్కువగా కురిసింది. అగనంపూడిలో అత్యధికంగా 4 సెం.మీల వర్షపాతం నమోదైంది. కొంతసేపు వర్షం కురుస్తూ, మరికొంత సమయం విరామం ఇస్తూ తెరలు తెరలుగా కురిసిన వర్షానికి నగరంతో జిల్లాలోని పలు ప్రాంతాలు చిత్తడిగా మారాయి. దీంతో వ్యాపారాలు అరకొరగా సాగాయి. మరోవైపు గురువారం కూడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. వీటికి చల్లని గాలులు తోడుకానున్నాయి.

వర్షపాతం ఇలా.. (సెం.మీలలో)

ప్రాంతం	వర్షపాతం	ప్రాంతం	వర్షపాతం
అగనంపూడి	4.0	దువ్వాడ	1.8
గాజువాక	3.2	గోపాలపట్నం	1.2
పెందుర్తి	2.2	ఆనందపురం	1.2
పెదగంట్యాడ	1.8	సింహాచలం	1.1
		మహారాణిపేట	1.0
		విశాఖ రూరల్	1.0

రైతులను ఆదుకుంటాం..

పంటపొలాలను పరిశీలించిన ఎమ్మెల్యే ముత్తంశెట్టి



శింగనబందలో నీట మునిగిన వరి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస: భీమిలి డివిజన్‌లోని మూడు మండలాల్లో 500 ఎకరాల్లో వరి పంట నష్టం జరిగినట్టు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన మండలంలోని తాటితూరు, శింగనబంద పంచాయతీల్లో మునిగిన వరి పంట పొలాలను అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. మూడు మండలాల్లో వరి 9,432 ఎకరాల్లో సాగు చేయగా మునిగిపోవడం, గాలికి వాలిపోవడం, కళ్లాల్లో ధాన్యం ఉండిపోవడం తదితర కారణాల వల్ల నష్టం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల ప్రకారం ప్రతి జిల్లాలో పంట నష్టం అంచనా వేయడానికి అధికారులను నియమించారన్నారు. వ్యవసాయాధికారులు కూడా రైతులకు జరిగిన నష్టాన్ని ఖచ్చితంగా అంచనా వేయాలన్నారు. తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. తరచూ పంట పొలాలు మునిగిపోవడానికి ఇష్టారాజ్యంగా పంట కాలువలు మూసివేత, రియల్ ఎస్టేట్ వ్యాపారులే కారణమని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఇరిగేషన్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో లవరాజును ఆదేశించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ రీజినల్ యూత్ కో ఆర్డినేటర్ ముత్తంశెట్టి శివ నందీష్, భీమిలి ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, జెడ్పీటీసీ గాడు వెంకటప్పడు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, జిల్లా కార్యదర్శి మద్దిల వెంకటరమణ, పార్టీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, సర్పంచ్‌లు గాడు వెంకటనారాయణ, లచ్చుబుగత జగదీశ్వరరావు, ఈశ్వరరావు, చిల్ల హరి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కూలిన పాత భవనం



సంపత్ వినాయగర్ ఆలయం వెనుక కూలిన భవనం

సీతమ్మధార: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆశీలమెట్టలోని సంపత్ వినాయగర్ ఆలయానికి చెందిన సుమారు 30 ఏళ్ల నాటి పాత భవనం కూలిపోయింది. దీంతో భవనం చుట్టు పక్కల అపార్ట్‌మెంట్లలోని నివాసితులు, స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ భవనానికి అనుకుని నిర్మాణంలో ఉన్న ఆలయానికి చెందిన అపార్ట్‌మెంట్‌పై పడటంతో పిల్లర్లు దెబ్బతిన్నాయి. భవనం కూలిన ప్రాంతంలో వాచ్‌మన్ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న జీవీఎంసీ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

వరద ప్రాంతాల్లో మేయర్ పర్యటన



పెంటమాంబ ఆలయ పరిసరాల్లో పర్యటిస్తున్న మేయర్ హరివెంకట కుమారి, ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: మిచాంగ్ తుపాను ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఎక్కడా వర్షపు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి ఆదేశించారు. నగరంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో బుధవారం ఆమె సుడిగాలి పర్యటన చేశారు. జీవీఎంసీ 95వ వార్డు పరిధి సాయిసాధనగర్, గొల్లవిల్లివానిపాలెం, 21వ వార్డు చినవాల్తేరు, 41వ వార్డు ఎర్రిగెడ్డ ప్రాంతం, 75వ వార్డు పరిధిలోని పెంటమాంబ ఆలయం సమీపంలోని ఊటగెడ్డతో పాటు 76వ వార్డు పరిధిలోని గెడ్డలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో గెడ్డలు పొంగకుండా చూడాలన్నారు. పెంటమాంబ ఆలయ సమీపంలోని ఊటగెడ్డ ఎత్తు పెంచాలన్నారు. గంగవరం పోర్టు వంతెన వద్ద గల కాలువ చుట్టూ బాక్స్ టైపులో రక్షణ గోడలు నిర్మించాలని సూచించారు. అనంతరం నడుపూరు ప్రధాన గెడ్డను పరిశీలించారు. ఈ గెడ్డలో వ్యర్థాలు లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, జోనల్ కమిషనర్ సింహాచలం, ఈఈ ప్రసాద్‌బాబు, ఏఎంవోహెచ్ డాక్టర్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై వర్తకుడి నిజాయితీ

భక్తురాలు పోగొట్టుకున్న నాలుగున్నర తులాల బంగారు నల్లపూసల దండ లాకెట్ అప్పగింత



భక్తురాలు వెంకటరత్నంకి బంగారు లాకెట్ అందజేస్తున్న వర్తకుడు మదన్

సింహాచలం: భక్తురాలు పోగొట్టుకున్న నాలుగున్నర తులాల బంగారు నల్లపూసల దండ లాకెట్‌ని తిరిగిచ్చి సింహగిరికి చెందిన వర్తకుడు నిజాయితీని చాటుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే... విజయనగరం ప్రభుత్వ ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలలో పీడీగా విధులు నిర్వర్తిస్తున్న తెర్ల వెంకటరత్నం బొబ్బిలిలోని వెలమపేటలో ఉంటున్నారు. ఈ నెల 5న కుటుంబ సభ్యులతో కలిసి శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనానికి వచ్చారు. దర్శనం అనంతరం వెంకటరత్నం తన సోదరి వరలక్ష్మితో కలిసి సింహగిరి మార్కెట్‌లో వస్తువులు కొనుగోలు చేసేందుకు పలు దుకాణాలు తిరిగారు. ఈ క్రమంలో ఆమె మెడలో ఉన్న నాలుగున్నర తులాల నల్లపూసల దండ బంగారు లాకెట్ పోగొట్టుకుంది. తిరుగు ప్రయాణంలో తగరపువలస వరకు వెళ్లాక... బంగారు లాకెట్ కనిపించకపోవడంతో హుటాహుటిన రాత్రి 8 గంటల సమయంలో మళ్లీ సింహగిరికి వచ్చారు. వారు తిరిగిన దుకాణాల వద్దకు వెళ్లి వర్తకులకు విషయాన్ని తెలియజేశారు. లాకెట్ దొరికితే ఇప్పించాల్సిందిగా ఫోన్ నంబర్ ఇచ్చారు. ఇదిలావుండగా షాప్ నంబర్–2 వర్తకుడు మదన్ వద్ద పనిచేస్తున్న నాయుడు, రోజాకు నల్లపూసల దండ లాకెట్ దొరకగా యజమానికి అప్పగించారు. అతడు వెంకటరత్నానికి ఫోన్ చేసి విషయం తెలియజేశారు. సింహగిరిపై పోలీస్ అవుట్ పోస్టు సిబ్బంది, సింహగిరి వర్తక సంఘం అధ్యక్షుడు ముగ్గు కిరణ్, కోశాధికారి దొంతల శంకర్, వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పైడిరాజు సమక్షంలో బుధవారం వెంకటరత్నానికి నల్లపూసల దండ లాకెట్‌ను మదన్ అందజేశారు. ఈ సందర్భంగా మదన్ నిజాయితీని పలువురు కొనియాడారు.

సమన్వయంతో ముక్కోటి ఏకాదశి నిర్వహణ

- 23న ఉదయం 5 గంటల నుంచి 11.30 గంటల వరకు ఉత్తర ద్వార దర్శనం
- 50 వేల మంది భక్తులు వస్తారని అంచనా
- సింహాచలం దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి వెల్లడి



మాట్లాడుతున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: అన్ని శాఖల సమన్వయంతో ఈ నెల 23న సింహగిరిపై ముక్కోటి ఏకాదశి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తామని సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. దేవస్థానం పరిపాలన కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం పోలీస్, జీవీఎంసీ, ఆర్టీసీ, మెడికల్ అండ్ హెల్త్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకాదశి రోజున సుమారు 50 వేల మంది భక్తులు శ్రీవరాహ లక్ష్మీ నృసింహ స్వామి దర్శనానికి వస్తారని అంచనా వేశామన్నారు. అందుకు తగ్గట్టు క్యూలైన్లు, ఇతర ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆలయ ఉత్తర రాజగోపురంలో వేకువజామున 5 గంటల నుంచి ఉదయం 11.30 గంటల వరకు ఉత్తర ద్వార దర్శనం భక్తులకు లభిస్తుందన్నారు. ఉచిత దర్శనం, రూ.100, రూ.300 టికెట్లతోపాటు కేవలం ఉత్తరద్వార దర్శన సమయంలో చెల్లుబాటయ్యేలా అదనంగా రూ.500 టికెట్లు ఉంటాయన్నారు.

భక్తులకు పక్కాగా ఏర్పాట్లు

భక్తులకు తాగునీరు, ఉచిత ప్రసాదం, అన్నదాన భవనంలో పొంగలి, పులిహోర ప్రసాదం అందిస్తామని ఈవో శ్రీనివాసమూర్తి తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ నుంచి ముగ్గురు వైద్యులు, ఆరుగురు పారామెడికల్ సిబ్బంది చొప్పున రెండు వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ నెల 22 సాయంత్రం నుంచి 23 సాయంత్రం వరకు వైద్య సిబ్బంది విధులు నిర్వర్తిస్తారని తెలిపారు. దేవస్థానం అంబులెన్స్‌తోపాటు 108 వాహనం కూడా అందుబాటులో ఉంటుందన్నారు. అగ్నిమాపక శకటాన్ని అందుబాటులో ఉంచుతామన్నారు. 23న తెల్లవారుజామున 3 గంటల నుంచి పది ఆర్టీసీ బస్సులు నడుపుతామని తెలిపారు. కొండ దిగువన, సింహగిరిపైన పారిశుధ్య పనులు చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్‌కు లేఖ రాశామన్నారు. ఉత్సవానికి పది రోజుల ముందు రూట్‌ప్లాన్ ప్రకటిస్తామన్నారు. ట్రాఫిక్ ఏడీసీపీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉత్సవం నిర్వహణలో ట్రాఫిక్‌ను పక్కాగా నియంత్రిస్తామన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పెద్ద ఎత్తున పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో దేవస్థానం ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌కుమార్, గోపాలపట్నం లా అండ్ ఆర్డర్ సీఐ సంతోష్‌కుమార్, ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్, అడవివరం ఆరోగ్య కేంద్రం వైద్యుడు డాక్టర్ సుదర్శన్, సింహాచలం ఆర్టీసీ డిపో మేనేజర్ రాజశేఖర్, జీవీఎంసీ జోన్ – 8 ఏఎంహెచ్‌వో డాక్టర్ కృష్ణంరాజు, అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ ప్రసాదరావు, దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్, పెనుమత్స శ్రీదేవి వర్మ, దశమంతుల రామలక్ష్మి, సువ్వాడ శ్రీదేవి, వంకాయల సాయి నిర్మల, ముదుండి రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళులు



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, పార్టీ నాయకులు

కొమ్మాది: ఎండాడలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం జరిగింది. అంబేడ్కర్ విగ్రహానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్సీ సెల్ విభాగం ఇన్‌చార్జి అల్లంపల్లి రాజబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ ఉత్తర సమన్వయకర్త కె.కె. రాజు, నియోజకవర్గ పరిశీలకుడు ఎస్.ఎ.రెహమాన్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్‌లు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు పిల్లా సుజాత, వడ్డాది మధుసూదనరావు, రవిరెడ్డి, వంకాయల మారుతీప్రసాద్, చంద్రశేఖర్, జానకీరామ్, జగ్గుపల్లి అప్పలరాజు, రఘురాజు, కృపాజ్యోతి, అప్పలనాయుడు, పేడాడ రమణికుమారి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఘాట్‌లో విరిగిపడుతున్న కొండచరియలు

సాక్షి,పాడేరు: భారీ వర్షాల కారణంగా పాడేరు ఘాట్‌లో పలుచోట్ల కొండచరియలు విరిగిపడుతున్నాయి. కొండవాగుల నీరు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రమాదాల నివారణలో భాగంగా వాహనాల రాకపోకలను ముందస్తుగానే నిలిపివేయాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ పోలీసుశాఖకు ఆదేశాలిచ్చారు. బుధవారం రాత్రి 8.30 గంటల నుంచి ఘాట్‌లో ఇరువైపులా వాహనాలను నిలిపివేశారు. మైదాన ప్రాంతాల నుంచి పాడేరు వచ్చే వాహనాలను ఘాట్ దిగువన ఉన్న తాటిపర్తి ఎస్ఈబీ చెక్ పోస్టు వద్ద ఆపేశారు. పాడేరు నుంచి మైదాన ప్రాంతానికి వెళ్లే వాహనాలను పాడేరుకు సమీపంలోని వంతాడపల్లి చెక్‌పోస్టు వద్ద నిలిపివేశారు. కొండ చరియలు జారిపడుతున్న ప్రాంతాలను బుధవారం సాయంత్రం ఆర్అండ్‌బీ ఈఈ బాల సుందరబాబు, సిబ్బంది పరిశీలించారు. గురువారం ఉదయం నుంచి తొలగింపు పనులు చేపట్టేందుకు ఆర్అండ్‌బీ, పోలీసుశాఖ కార్యాచరణ రూపొందించాయి.

11న సినీ నటుడు ఎల్బీ శ్రీరామ్‌తో ముఖాముఖీ

మద్దిలపాలెం: వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీన డాబాగార్డెన్స్‌లో గల అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సినీ నటుడు ఎల్బీ శ్రీరామ్‌తో ముఖాముఖీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని సొసైటీ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. ఈ సందర్భంగా లఘు చిత్రాల నిర్మాణం, వాటి పోకడలు అనే అంశంపై అవగాహన కల్పించనున్నామన్నారు. నటుడు మిత్రో పాల్గొంటున్న ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనన్నారు.

నేడు జనసేన బహిరంగ సభ

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని ఏఎస్ రాజా మైదానంలో గురువారం జనసేన బహిరంగ సభ నిర్వహించనుంది. ఈ మేరకు బుధవారం విలేకరులతో ఆ పార్టీ నాయకుడు పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ మధ్యాహ్నం 3 గంటలకు జరగనున్న ఈ సభకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. జనసైనికులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

కేకే లైన్‌లో పునరుద్ధరణ పనుల పూర్తి

తాటిచెట్లపాలెం: కేకే లైన్‌లో తైడ–శివలింగపురం సెక్షన్ మధ్య రైల్వే ట్రాక్‌పై విరిగిపడిన కొండచరియలను తొలగించి గూడ్స్ రైళ్ల రాకపోకలను బుధవారం పునరుద్ధరించారు. ఈ ప్రాంతంలో మంగళవారం సాయంత్రం కొండచరియలు విరిగిపడగా వాల్తేర్ డీఆర్ఎం సౌరబ్‌ప్రసాద్, సీనియర్ అధికారులతో కలిసి హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్నారు. విశాఖపట్నం, కోరాపుట్, అరకు నుంచి యాక్సిడెంట్ రిలీఫ్ రైళ్లు, సిబ్బందిని రప్పించి మంగళవారం రాత్రంతా పునరుద్ధరణ పనులు చేపట్టారు. ట్రాక్‌లపై నుంచి బండరాళ్లు తొలగించి గూడ్స్ రైళ్ల రాకపోకలను బుధవారం ఉదయం 9.30 గంటలకు పునరుద్ధరించారు. ఈ ప్రాంతంలో లైన్ క్లియర్ చేసినప్పటికి, ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఈ మార్గంలో ప్రయాణించే రైళ్లు రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. అప్పటికే అరకు చేరుకున్న కిరండూల్–విశాఖపట్నం(08552) రైలులో ఉన్న సుమారు 199 మంది ప్రయాణికులను మూడు ప్రత్యేక బస్సుల్లో విశాఖపట్నం తరలించారు.

రద్దయిన రైళ్లు : బుధవారం రాత్రి విశాఖపట్నం –కిరండూల్(18514) నైట్ ఎక్స్‌ప్రెస్, గురువారం రాత్రి కిరండూల్–విశాఖపట్నం(18513) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 7న విశాఖపట్నం–కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్, 8న కిరండూల్–విశాఖపట్నం (08552) పాసింజర్ స్పెషల్ రద్దు చేశారు.

హోంగార్డుల సేవలు అమోఘం



పోలీస్ కమిషనర్ రవిశంకర్, హోంగార్డు కమాండెంట్ రామ్‌మోహన్‌తో నగర హోంగార్డులు

- పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్
- ఘనంగా 61వ హోంగార్డు వ్యవస్థాపక దినోత్సవం

అల్లిపురం: పోలీసు శాఖలో ఒక భాగమై.. పోలీసులతో సమానంగా నిరంతరం విధులు నిర్వర్తిస్తూ హోంగార్డులు అందిస్తున్న సేవలు అమోఘమని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ కొనియాడారు. 61వ హోంగార్డు వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బుధవారం పోలీస్ కమిషనరేట్ ఆవరణలో గల నూతన కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో హోంగార్డుల సేవలు ప్రశంసనీయమన్నారు. వారు లేకుండా ఏ బందోబస్తు జరగడం లేదన్నారు. తాను పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో పనిచేసే సమయంలో హోంగార్డుల కోసం కొన్ని ప్రపోజల్స్ పంపించినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో ఇటువంటి విషయాలన్నింటిని అన్ని యూనిట్స్ నుంచి తీసుకొని సమగ్రంగా పరిశీలించి, ప్రభుత్వానికి నివేదించి సానుకూల నిర్ణయాలు తీసుకునేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. హోంగార్డులు ఆరోగ్యంపై శ్రద్ధ కనబరచాలన్నారు. హోంగార్డు కమాండెంట్ యు.రామమోహన్ మాట్లాడుతూ ప్రస్తుతం నగరంలో 1,045 మంది హోమ్‌గార్డులు శాంతిభద్రతలు, క్రైమ్, ట్రాఫిక్ విభాగాల్లో సేవలు అందిస్తున్నారన్నారు. అనంతరం హోమ్‌గార్డులు సీపీకి వినతి పత్రాలు అందజేశారు. ఆర్టీసీ బస్సు పాస్‌లు మంజూరు చేయాలని, నెలలో రెండు రోజులు ఉన్న సెలవును నాలుగు రోజులకు పెంచాలని, మెటర్నటీ లీవ్‌ను 3 నెలల నుంచి 6 నెలలకు పెంచాలని కోరారు. ఈ మేరకు సానుకూలంగా స్పందించిన సీపీ అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

సోదరభావం పెంపొందాలి

అమెరికా భాషా శాస్త్రవేత్త మైకేల్ బ్రాన్



చర్చావేదికలో పాల్గొన్న విద్యార్థులతో వీసీ సమత, అతిథులు

ఏయూక్యాంపస్: ప్రజల మధ్య సోదరభావం పెంపొందాలని అమెరికాకు చెందిన భాషా శాస్త్రవేత్త డాక్టర్ మైకేల్ బ్రాన్ అన్నారు. ఏయూ అంబేడ్కర్ చైర్ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం అమెరికన్ కార్నర్‌లో బ్రింగింగ్ బోర్డర్స్ ఫర్ ఈక్వాలిటీ అనే అంశంపై చర్చావేదిక నిర్వహించారు. పలు దేశాలకు చెందిన విదేశీ విద్యార్థులను భాగస్వాములను చేస్తూ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మనమంతా సమానమనే వాస్తవాన్ని గ్రహించాలని సూచించారు. ప్రతీ కుటుంబం విద్య, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. జీవించే హక్కు, సంతోషాన్ని పొందే హక్కును కలిగి ఉండాలన్నారు. విప్లవాత్మకమైన ఆలోచనలతో పనిచేసే వ్యక్తులు సమాజంలో మార్పును తీసుకువస్తారన్నారు. ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత మాట్లాడుతూ అంబేడ్కర్ దార్శనికతను ప్రపంచవ్యాప్తంగా యువతకు పరిచయం చేసే విధంగా ఈ కార్యక్రమం సాగిందన్నారు. ఏయూ పాలక మండలి పూర్వ సభ్యుడు డాక్టర్ పి.ఏసుపాదం మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న ప్రజల కష్టాలను తీర్చే దిశగా యువత ఆలోచన చేయాలని సూచించారు. రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ అసమానతలను రూపుమాపే విధంగా రాజ్యాంగాన్ని రచించిన అంబేడ్కర్ ఆలోచనలను యువతకు వివరించారు. ఆఫ్ఘనిస్తాన్ విద్యార్థి అబీదుల్లా మాట్లాడుతూ భారతదేశ విజయ రహస్యం రాజ్యాంగమేనన్నారు. అనంతరం అతిథులను వర్సిటీ తరఫున సత్కరించారు. కార్యక్రమంలో భాగంగా సూడాన్, ఘనా, బంగ్లాదేశ్, పాలస్తీనా, ఇథియోపియా, ఉగాండా తదితర దేశాలకు చెందిన విద్యార్థులు తమ ఆలోచనలు, తమ దేశంలో ఉన్న పరిస్థితులను వివరించారు.

రేపు మేరీమాత పండగ

నేటి అర్ధరాత్రి నుంచి ట్రాఫిక్ ఆంక్షలు

అల్లిపురం: పాతనగరం రోస్‌హిల్స్‌పై వెలసిన మేరీ మాత గుడి పండగ ఈ నెల 8న జరగనుంది. ఉత్సవానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా గురువారం అర్ధరాత్రి 12 గంటల నుంచి శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తూ జోన్–2 ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

- సీహార్స్ జంక్షన్, కాన్వెంట్ ఫ్లైవోవర్ కింద నుంచి వచ్చే భక్తులు తమ వాహనాలను రైల్వే ట్రాక్, పోర్టు ట్రాఫిక్ మేనేజర్ ఆఫీస్, పాత ఫైర్ స్టేషన్ ముందు నుంచి వెళ్లి.. పప్పుల మిల్లు గోడౌన్ రోడ్‌లో పార్కింగ్ చేసుకోవాలి. అక్కడి నుంచి కాలినడకన వేదాంత గేటు గుండా గుడికి చేరుకోవాలి.
- బీచ్‌రోడ్డు నుంచి వచ్చే భక్తులు జీసీబీ గేటు దాటిన తర్వాత వేంకటేశ్వర ఆలయం వద్ద తమ వాహనాలను పార్కింగ్ చేసుకోవాలి. అక్కడి నుంచి కాలినడకన గుడికి చేరుకోవాలి.
- వన్‌టౌన్ పాత పోస్టాఫీసు వైపుగా వచ్చే భక్తులు తమ వాహనాలను పాత రైల్వే యార్డులో పార్కింగ్ చేసుకోవాలి. కాలినడకన మోషన్ బ్రిడ్జి గుండా గుడికి చేరుకోవాలి.
- సీ హార్స్ రైల్వే ట్రాక్ పక్కన ఉన్న రోడ్డులో ఎటువంటి వాహనాలను ప్రవేశం లేదు. పోర్టుకు వెళ్లే భారీ వాహనాలు, కంటైనర్లకు అనుమతి లేదు. కాలినడకన వెళ్లే భక్తులకు ఈ రోడ్డును కేటాయించారు.

నెలలు నిండని పసికందుకు పునర్జన్మ

కేజీహెచ్ వైద్యుల ఘనత



పసికందు ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ అశోక్ కుమార్

మహారాణిపేట: నెలలు నిండకుండానే తక్కువ బరువుతో జన్మించిన పసికందుకు కేజీహెచ్ వైద్యులు 80 రోజుల పాటు చికిత్స అందించి ప్రాణాలు నిలబెట్టారు. బిడ్డ ఆరోగ్యం బాగుండటంతో బుధవారం డిశ్చార్జ్ చేసినట్టు సూపరింటెండెంట్ పి.అశోక్‌కుమార్ తెలిపారు. లక్షలాది రూపాయల విలువైన వైద్యం ఉచితంగా అందజేసినట్టు వివరించారు. శ్రీకాకుళం జిల్లా కోడూరు ప్రాంతానికి చెందిన గుజ్జాల దివ్య దీపికకు తీవ్ర కడుపు నొప్పి రావడంతో కేజీహెచ్‌కు తీసుకొచ్చారు. ఆమెను పరీక్షించిన వైద్యులు సెప్టెంబర్ 17న డెలివరీ చేశారు. 800 గ్రాముల బరువుతో 7వ నెలలోనే పుట్టిన పసికందుకు పుట్టుకతో కామెర్లు, ఊపిరితిత్తుల వ్యాధి, రక్తహీనత, రక్తంలో ఇన్ఫెక్షన్, కళ్లకు సంబంధించి అనేక అనారోగ్య సమస్యలు ఎదురయ్యాయి. పిల్లల వార్డు విభాగాధిపతి డాక్టర్ ఎం.ఎస్.రాజు ఆధ్వర్యంలో వైద్యులు బిడ్డకు అన్ని రకాల వైద్య సేవలందించారు. రెండు నెలల 19 రోజుల తర్వాత చిన్నారి బరువు 1.600 కిలోలకు పైగా పెరిగినట్టు డాక్టర్ రాజు వివరించారు.

కిలో కన్నా బరువు తక్కువగా ఉన్న నవజాత శిశువు ఆరోగ్యంగా డిశ్చార్జ్ అవడం.. కేజీహెచ్‌కు ఎంతో గౌరవప్రదమని సంతోషం వ్యక్తం చేశారు. ఆర్ఎంవో డాక్టర్ జగదీష్, అసోసియేట్ ప్రొఫెసర్ సత్యవేణి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ పద్మావతి, సింధూర తదితరులు పాల్గొన్నారు.

హిందీ పరీక్షల ఫీజు గడువు ఈ నెల 15

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచారసభ–చెన్నై ఆధ్వర్యంలో 2024 ఫిబ్రవరిలో నిర్వహించే పరిచయ్, ప్రాథమిక, మాధ్యమిక, రాష్ట్ర భాష, ప్రవేశిక, రాష్ట్ర భాష విశారద పూర్వార్థ, రాష్ట్ర భాష విశారద ఉత్తరార్థ, రాష్ట్రభాష ప్రవీణ పూర్వార్థ, రాష్ట్ర భాష ప్రవీణ ఉత్తరార్థ పరీక్షలకు హాజరయ్యేవారు ఈ నెల 15లోగా ఫీజులు చెల్లించవచ్చు. అలాగే ఈ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి, ఒకరికి గాయాలు



శిరీష జ్యోతి (ఫైల్)



ఒమ్మి శ్రీను

కశింకోట: మండలంలోని జాతీయ రహదారిపై వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. అదనపు ఎస్ఐ జె.నాగేశ్వరరావు అందించిన వివరాల ప్రకారం.. కశింకోట శివారులోని బంకు వద్ద అనకాపల్లి నుంచి యలమంచిలి వైపు వెళుతున్న స్కూటీని గుర్తు తెలియని లారీ ఢీకొంది. దీంతో స్కూటీ నడుపుతున్న అనకాపల్లి మండలం కూండ్రం గ్రామానికి చెందిన టీచర్ సేనాపతి శిరీషజ్యోతి(26) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. స్కూటీ వెనుక కూర్చున్న కర్రి భాగ్యశ్రీకి గాయాలవడంతో, ఆమెను అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. జ్యోతి స్థానిక సెయింట్ జాన్స్ స్కూల్లో ఇంగ్లిష్ టీచర్‌గా పని చేస్తున్నారు. స్కూల్‌కు వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాద స్థలాన్ని సీఐ ఎ.రవికుమార్ సందర్శించారు. మండలంలోని బయ్యవరం వద్ద జరిగిన మరో రోడ్డు ప్రమాదంలో సిమెంట్ పరిశ్రమలో పని చేస్తున్న ఒమ్మి శ్రీను(43) మృతి చెందాడు. మంగళవారం రాత్రి విధులు ముగించుకుని తన స్వగ్రామం జమాదులపాలెం వెళుతుండగా అనకాపల్లి నుంచి యలమంచిలి వైపు వెళుతున్న ప్రైవేట్ బస్సు వెనుకగా వచ్చి ఢీకొంది. దీంతో శ్రీను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు అందిన ఫిర్యాదులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తిని గాయపరిచిన యువకుడికి ఐదేళ్ల జైలు

విశాఖ లీగల్: ఒక వ్యక్తిని దారుణంగా గాయపరిచిన యువకునికి ఐదేళ్ల జైలు శిక్ష, రెండు వేల రూపాయలు జరిమానా విధిస్తూ నగరంలోని రెండో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి ఎం.వెంకటరమణ తీర్పు ఇచ్చారు. జరిమానా చెల్లించకుంటే అదనంగా మూడు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి ఆ తీర్పులో పేర్కొన్నారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.పాపారావు అందించిన వివరాలివీ.. నిందితుడు నాగమల్లి ఎల్లాజీ నగరంలోని వన్‌టౌన్ ప్రాంతంలో ఉంటున్నాడు. అతనిపై వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్‌తోపాటు 15 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రస్తుతం ఆరు కేసుల్లో విచారణ జరుగుతోంది. నిందితుడు ఎల్లాజీ తరచూ మద్యం సేవించి అందరితోనూ గొడవ పెట్టుకునే వాడు. ఈ నేపథ్యంలో 2016 జూన్ నెలలో నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని దొండపర్తి దగ్గర ఫిర్యాది ఎల్.రాజేష్ ఓ షాప్ వద్ద శీతల పానీయం తాగడానికి వచ్చాడు. పక్కనే ఉన్న నిందితుడు ఎల్లాజీ తనకు కూల్ డ్రింక్ కావాలని అడిగాడు. రాజేష్ నిరాకరించడంతో ఇద్దరి మధ్య స్వల్ప ఘర్షణ జరిగింది. దీంతో కొప్పడ్డ ఎల్లాజీ, రాజేష్‌పై కూల్ డ్రింక్ బాటిల్ విసి బలంగా గాయపరిచాడు. తీవ్ర గాయాలపాలైన రాజేష్ నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు ఎల్లాజీపై ఐపీసీ 307, ఇతర సెక్షన్లపై కేసు నమోదు చేసి నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో పైవిధంగా తీర్పు చెప్పారు. కేసు వాదించిన ఏపీపీ పాపారావుని నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ అభినందించారు.

గల్లంతైన ముగ్గురి కోసం గాలింపు

ఉధృతంగా ప్రవహిస్తున్న లువ్వాగెడ్డ





గల్లంతైన అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి, కుమార్



ఉధృతంగా ప్రవహిస్తున్న లువ్వా గెడ్డ

అనంతగిరి: మండలంలోని భీంపోల్ పంచాయతీ కేంద్రం సమీపంలోగల లువ్వా గెడ్డ వద్ద బుధవారం సాయంత్రం గల్లంతైన ముగ్గురి కోసం చీకటి పడేవరకు గాలింపు చర్యలు కొనసాగాయి. ఈ ఘటనలో సీతపాడు గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ గెమ్మెల లక్ష్మి(50), మిరియాల కమల(40), గెమ్మెల కుమార్(25) గల్లంతయ్యారు. గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తున్నందున పూర్తిస్థాయిలో గాలింపు చర్యలకు పరిస్థితులు అనుకూలించడం లేదు. తహసీల్దార్ రాంబాయి, ఎంపీడీవో శ్రీహర్షిత్, ఎంపీటీసీ అశోక్, సర్పంచ్ భీమ్మలమ్మ ప్రమాదానికి కారణాలు తెలుసుకున్నారు. రాత్రి కావడంతో గాలింపు చర్యలు నిలిపివేశామని, గురువారం ఉదయం మళ్లీ కొనసాగిస్తామని ఎస్ఐ కరక రాము తెలిపారు.

బైక్ ఢీకొని వృద్ధుడి దుర్మరణం



పోతురాజు మృతదేహం

మర్రిపాలెం: రోడ్డు దాటుతున్న వృద్ధుడిని బైకు ఢీకొనడంతో.. అతను మృతి చెందాడు. కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలివీ.. కంచరపాలెం నలందనగర్‌కు చెందిన కె.పోతురాజు(63) బుధవారం మధ్యాహ్నం ఊర్వశి సిగ్నల్ వద్ద రోడ్డు దాటుతున్నాడు. తాటిచెట్లపాలెం నుంచి బిర్లా వైపు బుల్లెట్‌పై వేగంగా వస్తున్న ప్రేమ్‌కుమార్ వృద్ధుడిని ఢీకొట్టాడు. ఈ ఘటనలో కింద పడిపోయిన వృద్ధుడిని సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సూచనలతో కేజీహెచ్‌కు తీసుకెళ్లగా.. అప్పటికే మృతి చెందినట్టు డాక్టర్లు నిర్ధారించారు. పోతురాజు టైలరింగ్ పనులు చేస్తుంటాడు. టిఫిన్ కోసమని బర్మా క్యాంపు నుంచి ఊర్వశి వైపు రోడ్డు దాటుతున్న క్రమంలో ఈ ఘటన జరిగింది. టౌన్ కొత్తరోడ్డులోని ఉల్లిపాయల వీధిలో ప్రేమ్‌కుమార్ నివసిస్తున్నాడు. ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్‌షాక్‌తో ఆర్టీసీ కండక్టర్ మృతి



మృతుడు కె.ఎస్.రావు

అనకాపల్లిటౌన్: విద్యుత్ షాక్‌తో సిరసపల్లి పోర్టు కాలనీకి చెందిన ఆర్టీసీ కండక్టర్ కె.ఎస్.రావు మృతి చెందినట్టు రూరల్ ఎస్ఐ సీహెచ్ నర్సింగరావు బుధవారం చెప్పారు. కె.ఎస్.రావు తమ ఇంటిలో వాటర్ మోటర్ స్విచ్ వేసినప్పుడు విద్యుత్ షాక్ గురై పడిపోయాడు. హుటాహుటిన ఎన్టీఆర్ వైద్యాలయానికి కుటుంబ సభ్యులు తరలించారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. మృతుడు భార్య ఉమా ఫిర్యా దు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అతనికి ఓ కుమార్తె ఉన్నారు.